## క్లుప్తంగా

### అఫ్జల్ జహాకు డాక్టరేట్



కడప కోటిరెడ్డిసర్కిల్ : కడపకు చెందిన పరిశోధక విద్యార్థి సి.అఫ్జల్ జహాకు తిరుపతి వెంకటేశ్వర యూనివర్శిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందని కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎం.దామ్లా నాయక్ తెలిపారు. ఉర్దూ విభాగ ఆచార్యులు డాక్టర్ అమీనుల్లా ఆధ్వర్యంలో కవాతినే రాయలసీమకి అదబి ఖిద్మత్ అంశంపై అఫ్జల్‌జహా పరిశోధక గ్రంథాన్ని సమర్పించినందుకు డాక్టరేట్ ప్రదానం చేశారన్నారు. ఈ సందర్భంగా పలువురు ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు.

### నేడు కామోత్సవ దహనం పుస్తకావిష్కరణ

కడప కల్చరల్ : ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 5 గంటలకు సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో కామోత్సవ దహనం పుస్తకావిష్కరణ ఉంటుందని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్‌బాబు తెలిపారు. అశ్లీల సాహిత్యానికి వ్యతిరేకంగా వచ్చిన రచనలపై చర్చ ఉంటుందని, ఈ కార్యక్రమానికి ప్రజా సంఘాల సభ్యులు, సాహితీవేత్తలు హాజరవుతారన్నారు.

### అంధ విద్యార్థులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న అవోపా మహిళా విభాగం ప్రతినిధులు

కడప కల్చరల్ : ఆర్య వైశ్య ప్రొఫెషనల్స్ అండ్ అఫీషియల్స్(ఆవోపా) మహిళా విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక శంకరాపురంలోని అంధుల పాఠశాల విద్యార్థులకు అన్నదానం చేశారు. చెప్పరపు సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆవోపా మహిళా విభాగం అధ్యక్షులు నాగ పుష్పాంజలి, కృష్ణం శివప్రసాద్‌లు అతిథులుగా హాజరయ్యారు. సంస్థ కార్యదర్శి దశమందం వెంకట సుప్రియ పర్యవేక్షణలో కార్యక్రమాన్ని నిర్వహించారు.

### మాసాపేటలో చలివేంద్రం



మజ్జిగ పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఎన్. సుబ్బారెడ్డి తదితరులు

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని మాసాపేటలో రక్షణ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శుద్ధజల చలివేంద్రాన్ని వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఎన్‌వీ.సుబ్బారెడ్డి, బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు బంగారు నాగయ్య యాదవ్, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.వినోద్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవి కాలంలో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రక్షణ సంస్థ అధ్యక్షుడు పి. సంపత్‌కుమార్, చైతన్య, పాస్టర్ ఫిలిప్, రత్న, కారుణ్య, రేవంత్, జశ్వంత్, ముత్తు, సామాన్విత పాల్గొన్నారు.

### ఎన్నికల సిబ్బందికి సౌకర్యాలు కల్పించాలి

కడప సెవెన్ రోడ్స్ : సార్వత్రిక ఎన్నికలలో పాల్గొనే సిబ్బందికి తగిన సౌకర్యాలు కల్పించాలని యూటీఎఫ్ నాయకులు కోరారు. కలెక్టరేట్ పరిపాలనాధికారి కె.విజయకుమార్‌ను కలిసి శుక్రవారం వినతిపత్రాన్ని సమర్పించారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ పోలింగ్ సిబ్బందికి తగిన మినహాయింపులు, సౌకర్యాలను కల్పించాలన్నారు. 58 సంవత్సరాల వయస్సు దాటిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు, గర్భవతులు, చిన్న పిల్లల తల్లులకు, అంగవైకల్యం, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి, మానసిక వైకల్యం, అంగ వైకల్యం కలిగిన పిల్లల తల్లులను ఎన్నికల విధుల నుండి మినహాయింపు ఇవ్వాలని కోరారు. క్యాడర్, సీనియారిటీ ప్రాతిపదికన విధులు కేటాయించాలని కోరారు. మహిళలకు వారు పనిచేస్తున్న అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని పట్టణ కేంద్రాలలో ఎన్నికల విధులను కేటాయించాలన్నారు. ఎన్నికల విధుల నిర్వహణ సందర్భంగా త్రాగునీరు, భోజన, వసతి ఏర్పాట్లు చేపట్టాలన్నారు. నిబంధనలకు అనుగుణంగా అన్ని ప్రాంతాలలో ఒకే విధమైన రెమ్యునరేషన్ విధానం అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ ఒంటిమిట్ట మండల అధ్యక్షుడు జి.గోపీనాథ్, చింతకొమ్మదిన్నె మండలం ప్రధాన కార్యదర్శి బి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

### నేడు ఎన్నికల ప్రచారం

చింతకొమ్మదిన్నె : కడప నగర పరిధిలోని 16వ డివిజన్‌లో శనివారం మధ్యాహ్నం మూడు గంటలకు కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్ రెడ్డి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించనున్నట్లు డివిజన్ ఇంచార్జి నాగిరెడ్డి ప్రసాద్‌రెడ్డి తెలిపారు. 16వ డివిజన్‌లోని చంద్రప్రతాప్‌రెడ్డి కాలనీ, మామిళ్ళపల్లి, మామిళ్ళపల్లి దళితవాడలలో ఈ ప్రచారం ఉంటుందన్నారు. కార్యక్రమానికి మండల నాయకులు సర్పంచులు, ఎంపీటీసీలు, పలు డివిజన్ల కార్పొరేటర్లు, ఇన్‌చార్జిలు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు



ఉపవాస దీక్ష విరమిస్తున్న ఉప ముఖ్యమంత్రి అంజద్ బాష, తదితరులు



ఇఫ్తార్ విందులో నగర ప్రముఖులు, విద్యార్థులు, తల్లిదండ్రులు

**ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ.అంజద్ బాష**

కడప కోటిరెడ్డిసర్కిల్ : పవిత్ర రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందు ప్రజల మధ్య సోదరభావం, మతసామరస్యాన్ని పరిమళింపజేస్తాయని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ.అంజద్ బాష పేర్కొన్నారు. కడప నగర శివారులోని ఫాతిమా మెడికల్ కళాశాలలో శుక్రవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కళాశాల చైర్మన్ ఏక్యూ జవ్వాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అంజద్‌బాష మాట్లాడుతూ కడప నగరం మత సామరస్యానికి ప్రతీక అన్నారు. పవిత్ర దైవారాధనకు, ధార్మిక చింతనకు, దైవభక్తికి క్రమశిక్షణకు, దాతృత్వానికి రంజాన్ మాసం ఆలవాలం అన్నారు. మనిషి సత్ప్రవర్తనలో నడవడానికి రంజాన్ ఉపవాసాలు ఉపకరిస్తాయన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో ప్రతి ఒక్కరూ దైవం అనుసరించిన మార్గంలో నడవాలన్నారు. అనంతరం అంజద్ భాష సామూహిక నమాజు పార్థనలు చేశారు. కార్యక్రమంలో కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సల్మాన్ ముర్తజా, రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ గౌసులాజం, మాజీమంత్రి అహ్మదుల్లా, డిప్యూటీ మేయర్ ముంతాజ్‌బేగం, నగర ముస్లిం ప్రముఖులు అఫ్జల్‌ఖాన్, అమీర్‌బాబు, నజీర్ అహ్మద్, కమలాకర్, కళాశాల వైద్యులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఆస్తి పన్ను బకాయిలు వసూలు చేయాలి



సచివాలయ సెక్రటరీలతో మాట్లాడుతున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని సచివాలయాల పరిధిలో ఆస్తి పన్ను, నీటి పన్ను బకాయిలను సక్రమంగా వసూలు చేయాలని నగర పాలక కమిషనర్ జీఎస్ఎస్.ప్రవీణ్ చంద్ ఆదేశించారు. 29వ డివిజన్‌లోని రెండు సచివాలయాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సచివాలయ ప్రాంగణమంతా శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. హాజరు పట్టికలను పరిశీలిస్తూ వారికి వచ్చినటువంటి ఫైల్స్ అన్నిటినీ క్రమ పద్ధతిలో సమకూర్చుకునేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఆర్థిక సంవత్సరం పూర్తి కావడానికి పది రోజులు మాత్రమే ఉన్నందున బకాయిలన్నీ వసూలు చేయాలన్నారు. వాహన పార్కింగ్‌కు బ్యారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సెక్రటరీలు, వలంటీర్లు పాల్గొన్నారు.

### మహిళలు అప్రమత్తంగా ఉండాలి

కడప అర్బన్ : కడప నగరంలోని ప్రజలు, ప్రధానంగా మహిళలు తమ ఇళ్ల సమీపంలో, రోడ్లలో వెళ్లేటపుడు అప్రమత్తంగా ఉండాలని ఒన్‌టౌన్ పోలీసులు సూచించారు. ఇటీవల కడప నగరంలో జరుగుతున్న చైన్ స్నాచింగ్‌లు, దొంగతనాల బారి నుంచి ప్రజలను అప్రమత్తం చేసేందుకు పోలీసు అధికారుల ఆదేశాల మేరకు బ్లూకోల్ట్స్ సిబ్బంది తమ ప్రాంతాలలో పర్యటించారు. ఎవరైనా అనుమానంగా సంచరించినా డయల్ 100కు సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలియజేశారు.

### ఓటు నమోదు చేసుకోవాలి

కడప సెవెన్‌రోడ్స్ : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అర్హులైన ప్రతి విద్యార్థి ఓటు నమోదు చేసుకోవాలని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జా తిరుమలేష్ విజ్ఞప్తి చేశారు. ఇప్పటికీ ఓటు నమోదు చేసుకోనివారికి భారత ఎన్నికల సంఘం ఏప్రిల్ 15వ తేదీ వరకు అవకాశం కల్పించిందని గుర్తు చేశారు.

## ఆడపిల్లల చదువుపై నిర్లక్ష్యం తగదు



ఆడపిల్లలకు చదువు ఆవశ్యకత తెలియజేస్తున్న అంగన్వాడీ సూపర్‌వైజర్ రెడ్డెమ్మ

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆడపిల్లల చదువుపై తల్లిదండ్రులు నిర్లక్ష్యం తగదని, వారిని సరైన రీతిలో ప్రోత్సహిస్తే దేశం గర్వించే స్థాయిలో ఉంటారని బాలల సంరక్షణ విభాగం లీగల్ ఆఫీసర్ పీఆర్ సునీతరాజు, ఓఆర్ డబ్ల్యూ.ప్రసన్నలక్ష్మి అన్నారు. బేటీ బచావో బేటి పడావో కార్యక్రమంలో భాగంగా స్థానిక గుంత బజార్ అంగన్వాడీ సెంటర్‌లో అంగన్వాడీ కార్యకర్తలకు ఆడపిల్లల చదువుపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆడపిల్లలపై వివక్షను వీడి వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసేలా నడుచుకోవాలన్నారు. వారికి ఆసక్తి ఉన్న అంశంలో ప్రోత్సహించి భవిష్యత్తులో ఉన్నత స్థానాల్లో నిలబడేలా చూడాలన్నారు. అనంతరం ఆడపిల్లల ఉన్నతికి ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటును వక్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో వి.రెడ్డెమ్మ, ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఇంధన పొదుపుపై శిక్షణ



మాట్లాడుతున్న కడప డీఎం డిల్లీశ్వరరావు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆర్టీసీ డ్రైవర్లు ఇంధన పొదుపు పాటించి సంస్థ పురోభివృద్ధికి పాటుపడాలని కడప డిపో మేనేజర్ డిల్లీశ్వరరావు తెలిపారు. కడప నగరంలోని ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో డ్రైవర్లు, కండక్టర్లకు ఇంధన పొదుపుపై శుక్రవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ మొదట డ్రైవర్లకు మానసిక ఒత్తిడిని తగ్గించేందుకు ధ్యానం చేయించామన్నారు. ర్యాష్‌గా, సెల్‌ఫోన్ మాట్లాడుతూ నడపడం సరికాదని, పంచ సూత్రాలు పాటించి డ్రైవింగ్ చేస్తే ప్రమాదాలను నివారించవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ ఇంధన పొదుపుపై మెలకువలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో రీజినల్ ఎస్‌డీఐ కృష్ణారెడ్డి, ప్రొద్దుటూరు సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ జయానందరావులు డ్రైవర్లను ఫీల్డ్‌లోకి తీసుకెళ్లి తగిన సూచనలు చేశారు.

## ఆసుపత్రుల యజమానులకు అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న డా. ఉమామహేశ్వరరావు, డా.చంద్రశేఖర్

కడప కార్పొరేషన్ : బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణ సక్రమంగా జరగాలని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డా.చంద్రశేఖర్ అన్నారు. కడప నగరపాలక సంస్థ కార్యాలయంలో నగరంలోని ఆసుపత్రుల యజమానులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డా.ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆసుపత్రులు, డయాగ్నొస్టిక్, ఫస్ట్ ఎయిడ్ సెంటర్లలోని బయో మెడికల్ వ్యర్థాలను ఘన వ్యర్థాలలో కలపవద్దని సూచించారు. సూదులు, దూది, సెలైన్ బాటిళ్లు, ఇతరత్రా వ్యర్థాలను ప్యాక్ చేసి సక్రమంగా వాహనాలకు అందించాలన్నారు. ఈ నెల 23వ తేదీ నుంచి ఈ షరతులను ఉల్లంఘించిన వారికి భారీ జరిమానా విధిస్తామని, వారి రిజిస్ట్రేషన్ నిలిపివేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్ఓ డా.కె.ఉమామహేశ్వరావు, కాలుష్య నియంత్రణ మండలి అసిస్టెంట్ ఇంజినీర్ అనిల్ కుమార్ రెడ్డి, కడప నగరపాలక సంస్థ పర్యావరణ ఇంజినీర్ ఎల్.రవీంద్రనాథ్‌రెడ్డి, అనలిస్ట్ సునీల్ కుమార్, శ్రీవెన్ ఎన్విరాన్మెంట్ టెక్నాలజీస్ ప్రతినిధి నరసింహులు పాల్గొన్నారు.

### గేట్ ఉత్తీర్ణతతో ఉన్నత విద్యావకాశాలు



పోటీ పరీక్షల నిపుణుడు శిషిర్ పెర్సాయి

వైవీయూ : గేట్ ఉత్తీర్ణత సాధించడం ద్వారా చక్కటి ఉన్నత విద్యావకాశాలు లభించడంతోపాటు ఉపాధి అవకాశాలు లభిస్తాయని న్యూఢిల్లీకి చెందిన మేడ్ ఈజీ కోచింగ్ సెంటర్ నిపుణులు శిషిర్ పెర్సాయి సూచించారు. కడపలోని కేఎస్ఆర్ఎం కళాశాలలో కెరీర్ డెవలప్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో బీటెక్ ప్రీ ఫైనల్ విద్యార్థులకు శుక్రవారం గేట్ పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష్యాన్ని నిర్దేశించుకుని, సమగ్ర అవగాహన, అంకితభావం, క్రమశిక్షణ, పట్టుదలతో సాధన చేయాలన్నారు. నిపుణుల సలహాలు, సమయపాలన పాటిస్తూ లక్ష్య సాధనకు కృషిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డా.నాగేశ్వరప్రసాద్, ఈసీఈ విభాగాధిపతి జి.హేమలత, ఈఈఈ విభాగాధిపతి ప్రియదర్శిని, సమన్వయకర్తలు ఆదినారాయణరెడ్డి, కుమార్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

## జల సంరక్షణ అందరి బాధ్యత



జల సంరక్షణ దినోత్సవంలో అధ్యాపకులు, విద్యార్థులు

వైవీయూ : నీటిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని జలవనరుల శాఖ జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్(ఎస్ఈ) కె. శ్రీనివాసులు పేర్కొన్నారు. కడప నగరంలోని కేఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ప్రపంచ జలదినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ మాట్లాడుతూ భూమిపై సకల జీవకోటి రాశులకు నీరు ప్రాణాధారమని, వృథా చేయకుండా పొదుపుగా ఉపయోగించుకోవాలని సూచించారు. అనంతరం నీటి సంరక్షణ విధానాలపై వ్యాసరచన, పోస్టర్ ప్రజెంటేషన్, మోడల్ మేకింగ్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ నాగేశ్వరప్రసాద్, సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డా.ఎస్.అమరనాథరెడ్డి, డా.వి.ఆదినారాయణరెడ్డి, ఆచార్య టి.కిరణ్‌కుమార్, కె.నివేదిత, ఇంజినీరింగ్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# చీనీ తోటల పరిశీలన



చీనీ తోటలను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారులు

చెన్నూరు : మండలంలోని బయనపల్లె(కొండపేట)గ్రామ పంచాయతీలోని చీని తోటలను వ్యవసాయ అధికారి, కేవీకే శాస్త్రవేత్త మానస, జ్యోతిర్మయి, మండల వ్యవసాయ అధికారి శ్రీదేవిలు పరిశీలించి బంక తెగులు, వేరు కుళ్ళు తెగులు, మంగునల్లి, సూక్ష్మధాతు లోపాలను గమనించారు. ఈ సందర్భంగా వారు రైతులతో మాట్లాడుతూ రైతులు చీని తోటల్లో నీటి యజామన్య పద్ధతులు సరిగా చేసుకోవాలన్నారు. చెట్టు చుట్టూ 1.5 అడుగుల దూరంలో పిల్ల పాది కట్టి, నీరు చెట్టు మొదలుకు తగలకుండా చూడాలన్నారు. అలాగే చెట్టు పాదుల్లో నీరు నిలువలేకుండా చేయాలన్నారు. లేనిచో బంక కారడం, వేరు కుళ్ళు తెగుల్ల సమస్యలు ఎక్కువగా వస్తాయన్నారు. బంక కారు తెగులు నివారణకు బంక కారి కుళ్ళిన బెరడును పూర్తిగా గోకి దానిని పొలానికి దూరంగా పడేయాలన్నారు. అలాగే బోర్డో పేస్టు లేదా కాపర్ ఆక్సీ క్లోరైడ్ పేస్టు లేదా మాంకోజెబ్ పేస్టు పూయాలన్నారు. కొమ్మలపై వచ్చే బంక తెగులు నివారణకు కార్బెండిజం 1గ్రా/లి. నీటికి కలిపి పిచికారీ చేయాలని మాంకోజెబ్ 3గ్రా/లీ. నీటికి కలిపి చెట్టు పాదులో పోయాలన్నారు.వేరు కుళ్ళు తొలి లక్షణాలు సాధారణంగా ఎండాకాలంలో కనిపిస్తాయని ఈ తెగులు ఆశించిన చెట్ల వేర్లు కుళ్లి, పోషకాలు అలాగే నీరు చెట్టుకు అందకుండా పోయి చెట్లు ఎండిపోతాయన్నార. వేర్లు పరిక్షిస్తే కుళ్లిన వాసన గమనించవచ్చన్నారు. తెగులు సోకిన చెట్లు విపరీతంగా పూత వచ్చి కాయలు ముదిరిపోయేలోగా చెట్లు వాడి ఎండిపోతాయని దీని నివారణకు రంగాపూర్ నిమ్మ మీద అంటుకట్టిన మొక్కలను నాటుకోవాలన్నారు. తెగులు సోకిన చెట్టుకు నీరు పెట్టిన మరుసటిరోజే 1% బోర్డో మిశ్రమం లేదా 0.2% కార్బెండిజమ్ (2 గ్రా/లీ నీటికి) ద్రావణం 20 లీటర్లు పాదులో పోయాలని తెగులు సోకిన చెట్లకు నీరు పెట్టిన మరుసటి రోజే మంకోజెబ్ 2గ్రా. లీటరు నీటికి కలిపి 25 లీటర్ల మందు ద్రావణం పాదుల్లో పోయాలన్నారు. 25 రోజుల తరువాత ట్రైకోడెర్మా రెస్సి 100గ్రా, సూడోమోనాస్ ఫ్లోరిసెన్స్ 100గ్రా, 2 కిలోల వేపపిండి, 25 కిలోల పశువుల ఎరువుతో కలిపి పాదుల్లో జూన్-జులై, డిసెంబరు-జనవరి నెలల్లో వేయాలని తెగులు సోకిన చెట్ల పాదుల్లో ఏదో ఒక వ్యవసాయ వ్యర్థ పదార్థాలు (వరిపొట్టు, వేరుశనగ పొట్టు, ఎండి రాలిన ఆకులు, మినుము/పెసర పొట్టు, రంపపు పొట్టు) భూకవచంలా 2–3 అంగుళముల మందంగా వేయాలని తెలిపారు. వర్షాలు మొదలైన తరువాత (ఆగస్టు, సెప్టెంబరు) పచ్చి ఆకు ఎరువులు అనగా వేపాకు, జనుము, పిల్లిపెసర, గంజాకు, నల్లేరు, తంగేడు, పాదిలోని మట్టితీసి, ఆకులను పరచి, వాటిపై సింగిల్ సూపర్ పాస్ఫేట్ చెట్టుకి ఒక కిలో చొప్పున పచ్చి ఆకుపై చల్లి, తీసిన మట్టిని మరలా కప్పాలన్నారు. ట్రైకోడెర్మా కల్చరు మిశ్రమ (1 కిలో కల్చరు 90 కిలోల బాగా చివికిన పశువుల ఎరువు, 10 కిలోల వేపపిండి) 4–5 రోజులు మగ్గబెట్టి చెట్టుకు 10 కిలోల చొప్పున పాదిలో వేసి కలియబెట్టాలి. మరలా 6 నెలల తరువాత ఇదే విధంగా చేయాలి. ఆరోగ్యంగా ఉన్న చెట్లకు ఈ మిశ్రమాన్ని ప్రతీ సంవత్సరం 5 కిలోల చొప్పున వేస్తే తెగులు రాకుండా ఉంటుంది. పచ్చిరొట్టి వలన భూమిలోని సూక్ష్మజీవులు ముఖ్యంగా ట్రైకోడెర్మా సంఖ్య పెరిగి తెగులు అరికట్టబడుతుందన్నారు. మంగు నల్లి నివారణకు లీటరు నీటికి 3 మీ.లి. వేప నూనె మరియు స్టికర్ (జిగురు) తోపాటు 3 గ్రా. నీటిలో కరిగే గంధకం లేక 1 మి.లీ. ప్రోపార్గైట్ లేదా ఇథియాన్ : 1 మి.లీ. లేదా ఫెన్జాక్విన్ : 1 2.5 స్పైరోమెసిఫిన్ : 0.8 మి.లీ. గోలీకాయ దశలో ఒకసారి 20 రోజుల తరువాత రెండవ సారి పిచికారి చేయాలి. సూక్ష్మ పోషకాల మిశ్రమాన్ని 5 గ్రా/లి. నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని తెలిపారు.

# జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేద్దాం

**వైఎస్సార్‌సీపీ ఎస్సీ, ఎస్టీ విభాగాల అధ్యక్షులు సిహెచ్ వినోద్ కుమార్, వేణుగోపాల్ నాయక్**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీహెచ్.వినోద్, వేణుగోపాల్ నాయక్

కడప కార్పొరేషన్ : ఎస్సీ, ఎస్టీలు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా ఎదగాలంటే వైఎస్.జగన్మోహన్‌రెడ్డిని రెండోసారి ముఖ్యమంత్రి చేయాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్‌కుమార్, ఎస్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్‌నాయక్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 27వ తేదీన ఇడుపులపాయ నుంచి బస్సుయాత్ర ప్రారంభించి ప్రొద్దుటూరులో సిద్ధం సభ నిర్వహించనున్నారని తెలిపారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోని ఎస్సీ, ఎస్టీలంతా పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. జగనన్న సీఎం అయిన తర్వాత దళిత, గిరిజన, బహుజన, మైనార్టీలకు పాలనలో భాగస్వామ్యం కల్పించి, కీలక పదవులు వారికే అప్పగించారని గుర్తు చేశారు. సామాజిక న్యాయం చేతల్లో చూపిస్తున్న జగనన్నను దళిత, గిరిజనులు ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నేతలు ఉప్పలపాటి యోబు, రాష్ట్ర ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి డాక్టర్ వింగ్ జిల్లా అధ్యక్షుడు. శివ నాయక్, రాజు, లక్ష్మీనారాయణ,శివ, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల ఉత్సాహం



ఎన్ఎస్ఎస్ క్యాంపులో నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

వైవీయూ : యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలోని పలు ఎన్ఎస్ఎస్ యూనిట్ల విద్యార్థులు నగరంలో ఉత్సాహంగా శుక్రవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. కడప నగరంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎస్. షకీలాబేగం ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు నగరంలోని పలు ప్రాంతాల్లో ఓటు నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఓటు ఆవశ్యకతను వివరించడం, చెట్లు పెంపకం, నీటి వృథాను అరికట్టడం వంటి సామాజిక అంశాలపై ప్రజల్లో చైతన్యం కల్పించారు.

**నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో..**

నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్–3 ప్రోగ్రాం ఆఫీసర్ ఎల్.అనంతలక్ష్మి ఆధ్వర్యంలో పలువురికీ సైబర్ సెక్యూరిటీపై అవగాహన కల్పించారు. యువత సైబర్ క్రైం బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం ర్యాలీగా నగరంలోని ప్రకాష్ నగర్ పరిసర ప్రాంతానికి వెళ్లి స్థానికులకు సైబర్ సెక్యూరిటీపై అవగాహన కల్పించారు.

## వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి



వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ కె. సురేష్ బాబును సన్మానిస్తున్న నాయకులు

కడప కార్పొరేషన్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్ కె.సురేష్ బాబు కోరారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడి క్యాంపు కార్యాలయంలో నగర అనుబంధ విభాగాల అధ్యక్షులు, సెక్రటరీలు శుక్రవారం సురేష్‌బాబును శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు ఇచ్చి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కడప నియోజకవర్గ నగర అధ్యక్షుడు ఎన్‌వి.సుబ్బారెడ్డి, మహిళా అధ్యక్షురాలు టిపి.వెంకటసుబ్బమ్మ, ఉపాధ్యక్షురాలు తులసమ్మ, బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు బంగారు నాగయ్య యాదవ్, ఉపాధ్యక్షుడు మధుసూదన్‌రావు, నగర అనుబంధ విభాగాల వైఎస్సార్‌సీపీ నాయకులు లక్ష్మినారాయణ, నాగరాజు, అర్జున్‌రావు, సాయిబాబా, బాబు, టి.రెడ్డెప్ప, పులి సునీల్ కుమార్, నిత్యానంద రెడ్డి, శివానాయక్ తదితరులు పాల్గొన్నారు.

## వైవీయూ క్యాంపస్ సుందరీకరణ

వైవీయూ : యోగి వేమన యూనివర్సిటీ క్యాంపస్‌ను సుందరీకరించేందుకు ఎన్ఎస్ఎస్ యూనిట్ 3, 6, 9 విద్యార్థులు శుక్రవారం శ్రీకారం చుట్టారు. యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎన్.వెంకట్రామిరెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు వివిధ ఆకృతులలో ఉన్న చెట్లపై వన్య ప్రాణుల చిత్రాలు రూపొందించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు శ్రీనివాసరావు, శ్రీధర్‌రెడ్డి, మృత్యుంజయరావు, అధ్యాపకులు బి.ఈరప్ప, చినరాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

**నీటి పొదుపుపై అవగాహన**

యోగి వేమన విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ యూనిట్– 4 ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సునీత ఆధ్వర్యంలో పెండ్లిమర్రి మండలం మిట్టమీదపల్లిలో శుక్రవారం ప్రపంచ నీటి దినోత్సవం నిర్వహించారు. నీటి పొదుపుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. యోగి వేమన విశ్వవిద్యాలయం మైనారిటీ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ రియాజున్నీసా నీటి ప్రాముఖ్యత, సంరక్షణ గురించి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వివరించారు. ప్రపంచ జల దినోత్సవంపై ఉప ఉపన్యసించారు.

## పేదలను ఆదుకోవడం సామాజిక బాధ్యత



చిల్డ్రన్ హోంకు రెఫ్రిజిరేటర్‌ను అందజేసిన ఎల్ఐసీ మహిళా ఉద్యోగులు

కడప కల్చరల్ : పేదలను ఆదుకోవడం సామాజిక బాధ్యత అని ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం శ్రామిక మహిళా విభాగం కన్వీనర్ అమీనా పర్వీన్, ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి, ఉపాధ్యక్షుడు అక్బర్ బాషా అన్నారు. కడప నగరానికి చెందిన జీవిత బీమా సంస్థ మహిళా ఉద్యోగులు శుక్రవారం స్థానిక బాసట చిల్డ్రన్స్ హోంకు రూ.30 వేల విలువైన రెఫ్రిజరేటర్, 11 మంది విద్యార్థులకు నూతన దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యక్తులు, బాసట లాంటి సంస్థలు తమ విలువైన సమయాన్ని వెచ్చించి ఇలాంటి సేవా కార్యకలాపాలకు చొరవ చూపడం అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సబ్ కమిటీ సభ్యులు శ్రీవాణి, పద్మజా లత, వసుప్రద, లీలా లక్ష్మి యూనియన్ నేతలు రాజు, అయ్యావారురెడ్డి, కుమార్, జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న పాలనలో ఆంధ్రరాష్ట్రం సుభిక్షం



ప్రజలతో మాట్లాడుతున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల రూరల్ : రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ పార్టీని అఖండ మెజార్టీతో గెలిపించాలని, జగనన్న పాలనలో ఆంధ్రరాష్ట్రం సుభిక్షంగా ఉందని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన నివాసం వద్ద ప్రజలతో పలు విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలందరు జగనన్న పాలనలో సుభిక్షంగా ఉన్నారని, వైఎస్సార్ పార్టీని ప్రజలు ఆదరిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. చంద్రబాబు, లోకేష్, పవన్‌కళ్యాణ్, బీజేపీ పార్టీలు ఏకమయ్యాయని వారందరు కలిసి ప్రజలకు ఎన్ని మాయమాటలు చెప్పినా ప్రజలు నమ్మేపరిస్థితుల్లో లేరన్నారు. పులివెందుల నియోజకవర్గాన్ని అన్ని విధాల జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి చేశారన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ప్రజలు బ్రహ్మరథం పడతారన్నారు. జరుగబోయే ఎన్నికల్లో అత్యధిక సీట్లు రావడం తథ్యమన్నారు. ప్రతిపక్ష పార్టీలు ఎన్ని కుట్రలు పన్నినా ప్రజలు జగనన్న వైపే మొగ్గుచూపుతున్నారన్నారు. ఆయన ప్రవేశపెట్టిన పథకాలే జగనన్నను ముఖ్యమంత్రి చేస్తాయన్నారు. గ్రామాలలో, మున్సిపాలిటీలలో జేసీఎస్ కన్వీనర్లు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేసే సమయం ఆసన్నమైందన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు.

### ఎక్కువ మందికి పనులు కల్పించండి

కమలాపురం : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనులు అభ్యర్థించిన కూలీలందరికి పనులు కల్పించాలని ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ భరద్వాజ్ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని ఎర్రగుడిపాడులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించి ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడారు. చేస్తున్న పనులకు వేతనాలు వస్తున్నాయా? అని ఆరా తీశారు. మస్టర్‌లో కూలీల హాజరును మొబైల్ ద్వారా అప్‌లోడ్ చేయడాన్ని పరిశీలించారు. గ్రామాలకు సమీపంలోనే పనులు గుర్తించాలని, మరింత ఎక్కువ మందికి పనులు కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ పార్థసారధి, జేఈ ఉపేంద్ర, టీఏ సురేష్‌రెడ్డి, కార్యదర్శి బ్రహ్మనందరెడ్డి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ చరణ్, ఎఫ్ఏ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.